నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 20 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL


## రక్షా బంధన్‌తో వినూత్న నిరసన

ఎదులాపురం, ఆగస్టు 19 : రక్షాబంధన్ వేడుకలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు కరుణ వినుత్న నిరసనకు శ్రీకారం చుట్టింది. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా అన్న అనిల్ రాఖీ కట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తానన్న తులం బంగారం, రూ.2500 పెన్షన్ ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. ఇందుకు సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం మా మహిళలకు ఇవ్వాల్సిన తులం బంగారం, రూ.2500 పెన్షన్ ఇప్పించాలని తయారు చేసిన కరపత్రం అన్నకు అందజేసింది. అనంతరం అన్న అనిల్‌కు రాఖీ కట్టింది. అలాగే తమకు అండగా నిలవాలని కోరింది.


అన్న అనిల్‌కు రాఖీ కట్టి అడబిడ్డలకు అండగా ఉండాలని కోరుతున్న చెల్లి

## కేటీఆర్‌కు రాఖీ కట్టిన మాజీ సర్పంచ్

ఇచ్చోడ, ఆగస్టు 19 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సోమవారం హైదరాబాద్‌లో ముక్రా(కే) మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఆమె వెంట మాజీ ఎంపీటీసీ సుభాష్ ఉన్నారు. కాగా.. ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు, యువతులు తమ అన్నలు, తమ్ముళ్లకు రాఖీ కట్టారు.


కేటీఆర్‌కు రాఖీ కడుతున్న మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి



### కేసీఆరే రూ.2 లక్షలు మాఫీ చేసిండు..

చిత్రంలో కనిపిస్తున్న రైతు దంపతులు జాదవ్ మారుతి-ఇందుమతి. వీరికి ముక్రా(కే)లో జాదవ్ మారుతికి నాలుగెకరాలు, ఇందుమతికి మూడెకరాల భూమి ఉంది. గతంలో ఒక్కొక్కరికి రూ. ఒక లక్ష బ్యాంకు రుణం ఉండగా కేసీఆర్ ప్రభుత్వంలో ఇద్దరికి కలిపి రూ.2 లక్షలు మాఫీ అయ్యాయి. దీంతో వారు తమ లోన్ రెన్యూవల్ చేసుకున్నారు. ఇందుమతి పేరిట రేషన్‌కార్డు ఉంది. రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం ఫలితంగా జాదవ్ మారుతి పేరిట ఇచ్చోడ ఎస్బీహెచ్ బ్యాంకులో వడ్డీతో కలిపి రూ.1.17 లక్షలు, ఇచ్చోడ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఇందుమతి పేరిట వడ్డీతో కలిపి రూ.1.07 లక్షల బాకీ అయింది. ఇద్దరి పేరిట రెండు బ్యాంకుల్లో కలిపి రూ.2.17 లక్షల అప్పు ఉండగా వీరికి రుణమాఫీ వర్తించలేదు. అధికారులను అడిగితే రూ.17 వేలు బ్యాంకులో కడితే రూ.2 లక్షలు మాఫీ అవుతాయని అంటున్నారని రైతు దంపతులు తెలిపారు. దీంతో వారికి ఏమి చేయాలో పోలుపోవడం లేదు.


ఆదిలాబాద్ జిల్లా ముక్రా (కే) గ్రామం

# రుణమాఫీ అడిగితే అరెస్టులు చేస్తారా?

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

తలమడుగు, ఆగస్టు 19 : రుణమాఫీ కాని రైతులు రుణమాఫీ అని అడిగితే అరెస్టులు చేస్తారా? అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రశ్నించారు. రుణమాఫీ కాని రైతులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించిన రైతులపై కేసులు పెట్టి అరెస్టు చేయించడంతో సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రైతులను కలిసి మాట్లాడారు. అమాయక రైతులపై కేసులు పెట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే సంపూర్ణ రుణమాఫీ చేసి రైతులతో పాలాభిషేకం చేయించుకోవాలన్నారు. అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కనీసం 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ప్రమాణికంగా రుణమాఫీ చేయాలన్నారు. ఆంక్షలు ఎందుకు అన్నారు. కుటుంబానికి రూ.2 లక్షలు అని చెప్పారు ఇంకా రూ.1.20 లక్షలు ఉన్న రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. అదే విధంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై అక్రమ కేసులు పెట్టడాన్ని మేము ఏ మాత్రం సహించమని అన్నారు. రైతుల మీద కేసులు పెడితే రైతు ఉద్యమానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ తీరున రైతు రుణమాఫీ భారీ ప్రకటనలతో అదరగొట్టే కాంగ్రెస్ ప్రభుత్వం చేతల్లో మాత్రం తుస్సుమనిపించిందన్నారు. తూతూ మంత్రంగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్న తీరును కాంగ్రెస్ వాదులు సైతం బహిరంగంగా విమర్శిస్తూ రైతులకు రేవంత్ సర్కారు ధోఖాను లెక్కలతో బయటపెడుతున్నారన్నారు. రుణమాఫీ కాలేదని రోడ్డెక్కిన రైతులను అరెస్టు చేయడం రైతన్నల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసినట్లే అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నిరసన కార్యక్రమంలో జరిగితే సాయంత్రం అరెస్టులు చేయడం ఏంటని అనుమానం వ్యక్తం చేశారు. రుణమాఫీ కాలేదని రైతులు కలెక్టరేట్లు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ చివరకు తమ సమస్యలను తెలిపేందుకు రోడ్ల మీదికి వస్తే అరెస్టు చేయడం రైతులను అవమానించినట్లే అని అన్నారు. రైతుబంధు రుణమాఫీ రాక అన్నదాత ఆవేదన చెందుతుంటే అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. తెలంగాణ రైతులకు తమ సమస్యలు చెప్పుకునే స్వేచ్ఛ కూడా లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్, తలమడుగు మండల కన్వీనర్ వెంకటేశ్ పాల్గొన్నారు.


అరెస్టు అనంతరం ఇంటికి వచ్చి రైతులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### రుణమాఫీకి వడ్డీతో ఏమీ సంబంధం



కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బ్యాంకులో ఎంత అప్పు ఉన్న రూ. ఒక లక్ష మాఫీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పి అంతకంటే ఎక్కువ బాకీ ఉంటే ఇవ్వడం లేదు. గతంలో రైతులు తీసుకున్న రూ. 2 లక్షల రుణాలు వడ్డీతో కలిపి రూ. 2.20 లక్షల వరకు అయ్యాయి. ప్రభుత్వం వడ్డీతో రుణమాఫీకి ముడిపెట్టడం ఏంటి? రుణాలను ఎగ్గొట్టడానికి ప్రభుత్వం ఈ నాటకానికి తెరతీసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణాలను మాఫీ చేయాలి.

*- లఖే అశోక్. రైతు, ముక్రా(కే), ఇచ్చోడ మండలం, ఆదిలాబాద్ జిల్లా.*

ఫీల్డ్ విజిట్ FIELD VISIT

# 22 శాతమే మాఫీ



**ముక్రా(కే) గ్రామంలో రుణమాఫీ దుస్థితి**

- 221 మంది రైతులకు 49 మందికే లోన్ రద్దు
- నిబంధనల పేరిట రైతులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు
- షరతులు లేకుండా రూ.2 లక్షల మాఫీ చేయాలని డిమాండ్
- 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయిలో పరిశీలన

ఆదిలాబాద్, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ కేవలం కాగితాలకే పరిమితమైనట్లు అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం రైతులను మభ్యపెట్టి రూ.2 లక్షల రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాయిదా పద్ధతుల్లో మాఫీ అంటూ ఎగనామం పెట్టారంటూ మండిపడుతున్నారు. ఎలక్షన్‌లో షరతులు లేకుండా రూ.2 లక్షల పంట రుణం మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఓట్లు దండుకుని తమను మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో రుణమాఫీకి సంబంధించిన 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయి పరిశీలన చేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల్లో అసహనం కనిపించింది.

### ముక్రా(కే)లో 49 మందికే మాఫీ

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే)లో ప్రభుత్వం కేవలం 22 శాతం మంది రైతులకు రుణమాఫీ చేసింది. 221 మంది రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. వారు ఏటా తమ రుణాలను రెన్యూవల్ చేసుకుంటూ వస్తున్నారు. 221 మంది రైతులకు కేవలం 49 మందికి మాత్రమే మాఫీ వర్తించింది. మిగతా 172 మంది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపింది.

### శాపంగా మారిన నిబంధనలు

రుణమాఫీ విషయంలో ప్రభుత్వం విధించిన నిబంధనలు శాపంగా మారాయి. తమ రుణాలు ఎందుకు మాఫీ కాలేదని రైతులు వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారులను అడుతున్నా వారి వద్ద నుంచి సరైన సమాధానం రావడం లేదు. లోన్ మాఫీ కాని రైతులు తమ వివరాలతో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వానికి పంపిస్తామని అంటున్నారు. మరికొందరు మీ వివరాలు సరిగా లేకపోవడం బ్యాంకుల్లో వడ్డీతో కలిపి రూ. 2 లక్షకు పైగా అప్పు ఉండడంతో మాఫీ కాలేదని చెబుతున్నారు. రైతు కుటుంబాల్లో ఇద్దరు పట్టాదారులు ఉన్నా వారు తీసుకున్న లోన్ రూ.2 లక్షలకు దాటడం, రుణమాఫీ విషయంలో ప్రభుత్వం పట్టాపాసు పుస్తకాలను కాకుండా రేషన్‌కార్డును పరిగణలోకి తీసుకోవడంతో రైతులు పంట రుణాల మాఫీకి దూరమయ్యారు.

## కలెక్టర్‌కు ఫిర్యాదు

ఎదులాపురం, ఆగస్టు 19 : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్న తమకు మాత్రం ఇప్పటివరకు రూపాయి కూడా మాఫీ కాలేదని ఇంద్రవెల్లి మండలంలోని ధనోర(బీ) గ్రామ రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో 350 మంది రైతులున్నారని, అందరి అకౌంట్లు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఉన్నాయని తెలిపారు. తమకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని విన్నవించారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అకౌంట్లలో ఇబ్బంది ఉందని, నెల రోజులోపు సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఇంద్రవెల్లి వ్యవసాయ శాఖాధికారితో ఫోన్‌లో మాట్లాడి ధనోర(బీ) గ్రామంలో రైతుల వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ధనోరా(బీ) గ్రామ రైతులు


సోమార్‌పేట్‌లో నిరసన తెలుపుతున్న రుణమాఫీ కాని రైతులు


కాలనీలో బైక్ ర్యాలీతో నిరసన చేస్తున్న రైతులు

## బైక్ ర్యాలీతో రైతుల నిరసన

ఖానాపూర్ రూరల్, ఆగస్టు 19 : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరిట మోసం చేసిందని రైతులు ఆందోళనబాట పట్టారు. ఖానాపూర్ మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో 250 మందికిపైగా రుణాలు మాఫీ కాలేదని బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కడారి గోపాల్, వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని ఓట్లయ్యాక రైతులను నట్టేట ముంచారన్నారు. రుణమాఫీ అరకొర కాకుండా పూర్తిస్థాయిలో అమలు చేయలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ డౌన్ డౌన్, రేవంత్ డౌన్ డౌన్ అంటూ నినదించారు. కొడారి రవీందర్, భుక్యా రవి, కొండ్ర దేవేందర్, అలిశెట్టి రాజు, పరమేశ్, ననేశ్, రాజు, రంజిత్, అశోక్, శేఖర్, గుగ్లావత్ అమ్ము, కైలాశ్, సంతోశ్ పాల్గొన్నారు.

## రుణమాఫీ కాలేదని రైతుల నిరసన

బోథ్, ఆగస్టు 19 : ధన్నూర్(బీ) గ్రామంలో రైతులు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా రూ.2 లక్షలు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, యువకులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ధన్నూర్(బీ) రైతులు

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- అనాథ బాలికకు భరోసా ఇచ్చిన మంత్రి
- లక్ష రూపాయలను పంపిన మంత్రి
- తహసీల్దార్ సమక్షంలో బాలికకు అందజేత



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పంపిన చెక్కును బాలికకు అందిస్తున్న తహసీల్దార్, నాయకులు

తానూర్, ఆగస్టు 19 : తల్లి అంత్యక్రియల కోసం కూతురు దుర్గ భిక్షాటన చేసిందన్న కథనం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కదలించింది. సోమవారం తన సన్నిహితుడు సతీశ్‌రెడ్డితో లక్ష రూపాయలు పంపించి తన ఉదారతను చాటుకున్నాడు. ఈ డబ్బులను దుర్గకు తహసీల్దార్ లింగమూర్తి నాయకుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బాలికతో వీడియోకాల్‌లో మాట్లాడుతూ.. అధైర్యపడొద్దని నెలకు రూ.10 వేలు, ఇల్లు కట్టిస్తా, చదివినంత చదివిస్తానని భరోసాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీడివో లబ్దుల్‌సమద్, బీజేపీ నాయకుడు చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ గోప సాయినాథ్, మాజీ ఎంపీటీసీ మధుపటేల్, నాయకుడు అట్టల్ దేవీదాస్ పాల్గొన్నారు.

### బాలికను పరామర్శించిన ప్రజాప్రతినిధులు

బెల్‌తరోడ గ్రామంలో తల్లితండ్రులను కోల్పోయి అనాథగా మారిన దుర్గను స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణ్‌రావు పటేల్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. అనాథ బాలిక దుర్గకు విద్యాపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. వీరి వెంట మాజీ సర్పంచ్ గోప సాయినాథ్ ఉన్నారు.


ఆదిలాబాద్ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న జనం

## పండుగ పూట పరేషాన్

**ఆదిలాబాద్‌లో బస్సులు లేక ఇబ్బందులు**

ఆదిలాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్‌లో సోమవారం రాఖీ పండుగ రోజు జనం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకుంది. పండుగ సందర్భంగా ఇతర పట్టణాలు, గ్రామాల్లో ఉన్న తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టడానికి మహిళలు ఎక్కువ సంఖ్యలో బస్టాండ్‌కు చేరుకున్నారు. రద్దీ ఎక్కువ కావడంతో బస్సులు కిక్కిరిసి కనిపించాయి. దీంతో వారు ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకున్నది. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో గంటల కొద్ది వారు బస్టాండ్‌లో ఎదురుచూడాల్సిన వచ్చింది.

## ఆదర్శం.. పోలీస్ బాస్

- వర్షం కారణంగా నిలిచిన ట్రాఫిక్
- నియంత్రించిన ఎస్పీ జానకి షర్మిల
- ప్రశంసించిన పట్టణవాసులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 19 : ఆమె జిల్లా పోలీస్ బాస్.. ఉన్నతాధికారి అయినప్పటికీ వెంటనే వాహనం దిగి ట్రాఫిక్ నియంత్రించారు. కిందిస్థాయి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం ఏకదాటిగా అరగంటపాటు వర్షం కురిసింది. దీనికి తోడు రాఖీ పండుగ సందర్భంగా బస్టాండ్ ఏరియా, బట్టల దుకాణాల్లో రద్దీ పెరిగింది. వర్షం తగ్గిపోవడంతో ఒక్కసారిగా అందరూ బయటకు రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో ఎన్టీఆర్ మార్గ్ నుంచి ట్యాంక్ బండ్ వరకు పూర్తిగా ట్రాఫిక్ జాం అయింది. గంటల తరబడి రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో బస్టాండ్ వైపు వెళ్తున్న ఎస్పీ వాహనం దిగి వర్షాన్ని కూడా లెక్కచేయకుండా రెండు గంటలపాటు ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ సందర్భంగా పట్టణవాసులు ఆమెను ప్రశంసిస్తున్నారు.


నిర్మల్‌లో ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న ఎస్పీ జానకి షర్మిల